


మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 105 | కర్నూలు | గురువారం 28-05-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi




# సంస్కరణలకు,విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది

టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే
పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం
దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి
మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం
45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం
మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత
ఈ మహానాడు మహిళలకు అంకితం ఇస్తున్నాం
23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు
మహానాడు మోడల్ మారిందు తప్ప..విధానం మారలే
వైసిపి హయాంలో అణచివేతలను ఎదుర్కొని నిలబడ్డాం
మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు

(మిగతా 8లో)







## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

పార్టీ జెండా ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు
పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి
హాజరైన పార్టీ ప్రముఖులు, పొలిట్ బ్యూరో సభ్యులు



అమరావతి,మే27(శ్రీచక్ర) : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷ులినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పుడు గమనిస్తుండాలి

సొంత తల్లిని, చెల్లిని మెడపెట్టి గెంటేసిన చరిత్ర వారిది
డీఎస్సీని అడ్డుకోవాలని వైసీపీ నేతలు చూశారు
పదో తరగతి పేపర్ లీక్ చరిత్ర వారిదని మరచిపోవద్దు
మహానాడులో వైసిపి తీరును ఎండగట్టిన లోకేశ్



అమరావతి,మే27(శ్రీచక్ర) : గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పుడు గమనిస్తూ ఉండాలని.. జగన్ అండ్ కో డీఎస్సీపై చేసే కుట్రలను తిప్పి కొట్టాలని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత తల్లిని, చెల్లిని మెడపెట్టి గెంటేశారని ధ్వజమెత్తారు. జగన్ బాబాయి, మాజీ మంత్రి వివేకానందరెడ్డిని గొడ్డలితోనే కదా చంపారు... అందుకే వైసీపీని గొడ్డలి పార్టీ అని పిలుస్తున్నామని విమర్శించారు. గత మహానాడులో 6 శాసనాలు ప్రవేశపెట్టామని.... వీటిని మనం ఎప్పుడు గుర్తుపెట్టు కోవాలని సూచించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీని అడ్డుకోవాలని వైసీపీ నేతలు చూశారని ధ్వజమెత్తారు. 'నీది పదోతగరతి పేపర్ లీక్ చేసిన చరిత్ర.. నాది స్టాన్‌ఫర్డ్‌లో చదివిన చరిత్ర. బోత్ ఆర్ నాట్ సేమ్ బ్రదర్ సైకో. టీచర్లను మేము సింగపూర్ పంపిస్తే.. నువ్వు మద్యం షాపుల ముందు కాపలా పెట్టావ్' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం గడపదాటే లోపల అబద్ధం ప్రపంచాన్ని చుట్టేస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. టీడీపీలో సంస్కరణలు తీసుకురావడానికి ఎంతగానో పోరాడామని తెలిపారు. జిల్లాస్థాయి నుంచి పార్లమెంటరీ స్థాయికి పార్టీ ఎదుగుదలకు చాలా పోరాటం చేశామని చెప్పుకొచ్చారు. ఒక మండల పార్టీ అధ్యక్షురాలు శ్రీదేవిని, ధనుంజయ్‌లను పొలిట్‌బ్యూరోలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ఆందోళనలకు అనుమతి ఇస్తున్నామని తెలిపారు. ఎక్కడా కూడా గేట్లను తాళ్లతో కట్టలేదని తేల్చిచెప్పారు. చిన్నచిన్న సమస్యలు ఉండొచ్చని.. వాటిని నాలుగు గోడల మధ్య కూర్చుని పరిష్కరించుకోవాలని సూచించారు. 151 సీట్ల నుంచి 11 స్థానాలకు వైసీపీ ఎలా వచ్చిందో చూశామని.. ప్రజల దగ్గరకు టీడీపీ నేతలు వెళ్లాలని.. వారి సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వం కొనసాగింపు చాలా అవసరమని... అందరూ ఈ విషయాన్ని ఆలోచించాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. 1983లో టీడీపీని ఎన్టీఆర్ అధికారంలోకి తీసుకువచ్చారని చెప్పారు. 1982లో ఏపీ, బిహార్ తలసరి ఆదాయం ఒకేలాగా ఉండేదని.... టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మార్పు తెచ్చిందని ప్రస్తావించారు. తెలుగుదేశం వరుసగా అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్రం చాలా అభివృద్ధి చెంది ఉండేదని చెప్పుకొచ్చారు. ఏపీలో నమో అంటే నాయడు... మోదీ జోడీ అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు తనకు అండగా పవన్ కల్యాణ్ నిలిచారని ప్రస్తావించారు. చంద్రబాబు జైలుకు వెళ్తున్నప్పుడు తొలిసారిగా పవన్ ఫోన్ చేశారని గుర్తుచేశారు. డబుల్ ఇంజిన్ బు÷-లలెట్ ట్రైన్ ఉండటంతోనే విశాఖ ఉక్కు, రైల్వేజోన్ సాధించామని తెలిపారు. కర్నూలుకు హైకోర్టు బెంచి తెస్తామని, రాయలసీమకు ÷టైర్ జెట్ పరిశ్రమ తీసుకువచ్చామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

మిత్రపక్షాలతో సఖ్యతతో మెలగాలి
మహానాడులో చంద్రబాబు పిలుపు



అమరావతి,మే27(శ్రీచక్ర) : స్థానిక ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని తెదేపా అధినేత చంద్రబాబు ఆదేశించారు. ఏ ఎన్నికలైనా గెలుపే ప్రధానమని స్పష్టంచేశారు. గెలుపే ధ్యేయంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలి, ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎవరూ ఇగోలకు వెళ్లొద్దని చంద్రబాబు హితవు పలికారు. మిత్ర పక్షాలతో సఖ్యతతో, సమన్వయంతో ముందుకు వెళ్దామని దిశానిర్దేశరచేశారు. 2024 ఎన్నికల్లో సాధించిన విజయం మళ్లీ రిపీట్ అయ్యేలా అందరం మమేకం అవుదామన్నారు. స్పెషల్ రివిజన్‌లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో లీడర్లు, కేడర్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలుగుదేశం బలం బలగం కేడర్ అన్న చంద్రబాబు.. ఏదైనా పార్టీ ఫస్ట్, కేడరే ముందని తెలిపారు. నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఇక్కడ చదువుకున్న, శిక్షణ పొందిన నాయకులే అన్ని చోట్లా రాణిస్తున్నారని గుర్తుచేశారు. సోషల్ రీ ఇంజినీరింగ్ చేయటమే పార్టీ విధానమని తెలిపారు.

## పెరుగుతున్న ఎండల తీవ్రత

అప్రమత్తంగా ఉండాలని ప్రధాని సూచన



న్యూఢిల్లీ,మే27(ఆర్ఎన్ఎ): దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు.

## మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు
మోడీ నాయకత్వంలో ఆర్థికంగా బలపడ్డ భారత్
జగన్ జనంలో లేకపోవడమే పెద్ద శాపం
మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ,మే27(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోదీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు. జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాల్సిందే!

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు సావాల్‌గా మారింది. అలాగే దేశంలో అలజడులకు కారణమవుతోంది. పెరుగుతున్న జనాభాకు తోడు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారి కారణంగా పలు రాష్ట్రాలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నాయి. దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. ఓటర్లుగా ఉన్న విదేశీయులను మొన్నటి ఎన్నికలకు ముందు సర్ ప్రక్రియలో లక్షల్లో తొలగించారు. దీనిపై నాటి సిఎం మమతా బెనర్జీ నానాయాగీ చేశారు. అసలు ఎంతమంది ఉన్నారన్నదానికి లెక్కాపత్రం లేనంతగా ఇక్కడ అక్రమ వలసదారులు చేరిపోయారు. అమెరికాలో ట్రంప్ వచ్చాక నిర్దాక్షిణ్యంగా అక్రమ వలసదారులను తన్‌ఇన తరిమేశారు. ప్రపంచ దేశాలు నిరసనలు వ్యక్తం చేసినా ట్రంప్ పట్టించుకోలేదు. ఇది ఓ హెచ్చరికగా అన చర్యలు నిలిచాయి. ఇప్పుడు భారత్ కూడా అలాంటి చర్యలను కఠినంగానే తీసుకోక తప్పదు. ఈ క్రమంలో బెంగాల్లో అక్రమవలసదారులపై ప్రభుత్వం కోరడా ఝుళిపించింది. ఇకపోతే అక్రమ వలసతకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వా నికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా మారడం తో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు. ఇదిలా వుంటే బెంగాల్లో అక్రంగా తిష్టవేసిన వారు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరారు. మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది, స్థానికులనే సవాల్ చేసే స్థాయికి చేరారు. ఈ క్రమంలో కొత్తగా అధికారం చేపట్టిన సువేందు అధికారి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ వసలదారులను తరిమేసే పనులు చేపట్టింది. కొంచెం కఠినంగానే హెచ్చరించింది. తన్ని తరిమేసే వరకు ఆగకుండా పారిపోవాలని హెచ్చరించింది. ఈ క్రమంలో సరిహద్దులకు బంగ్లా అక్రమచొరబాటుదార్లు చేరుకుంటున్న దృశ్యాలు చూస్తున్నాం. దీనిని బట్టి ఎంతగా ఇక్కడ తిష్టవేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బెంగాల్లో కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు ఇప్పుడు అక్కడ అక్రమవసలదారుల గుండెల్లో దడపుట్టిస్తోంది. తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొనేలోపే రాష్ట్రం విడిచి పారిపోవాలని చొరబాటుదారులను సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలి? వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలి? ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా?' అని సువేందు ప్రశ్నించారు. గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి నినాదంతో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను వెనక్కి పంపడానికి బెంగాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి.ఈ క్రమంలో అక్రమ వలసదారులపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి.. చట్ట విరుద్ధంగా ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాల ను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు నుంచి విడుదలై.. తమ తమ దేశాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర హోం శాఖ లేఖలు రాసింది. మొత్తంగా బెంగాల్లో ఏరివేత కారణంగా బీహార్, అసోం తదితర రాష్ట్రాల్లో వారు షెల్టర్ పొందకుండా చూడాలి. అక్కడి ప్రభుత్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలి. అలాగే హైదరాబాద్‌లో తిష్టవేసిన రోహిగ్యాలను కూడా పట్టుకని పంపించాలి.

# రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నాం

**రెండేళ్లలో సాధించిన విజయాలు ప్రజలకు వివరించాలి**

**కర్నూలులో మహానాడు కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ గుప్తా**







కర్నూలు, మే 27 (శ్రీచక్ర): రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలు ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కర్నూలు నగరంలోని మౌర్య ఇన్‌లో జరిగిన మహానాడు కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ముందుగా దివంగత నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న మహానాడు కార్యక్రమాన్ని నాయకులతో కలిసి వీక్షించారు. కర్నూలు నగరంలో మొత్తం 12 ప్రాంతాల్లో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేయాల్సిన పనులపై మహానాడులో చర్చిస్తామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత క్యాడర్‌పై ఉందన్నారు. సంక్షోభం నేపథ్యంలో అన్ని జిల్లాల్లో, అన్ని ప్రాంతాల్లో వర్చువల్‌గా మహానాడు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకం ప్రజలకు తెలుసన్నారు. అయితే అప్పుడు, ఇప్పుడు అధికారులు ఒక్కరేనని.. నాయకుడు మాత్రమే మారాడన్నారు. విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు వలనే రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. దేశంలో వచ్చే పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు నివారించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఓర్వకల్లులో జైరాజ్ స్టీల్ కంపెనీకి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని.. అయితే గత ప్రభుత్వంలో అనుమతులు ఆలస్యం చేయడం వల్ల జైరాజ్ కంపెనీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. తమ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు మరో రూ.6వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు జైరాజ్ స్టీల్ కంపెనీ యాజమాన్యం ముందుకొచ్చిందన్నారు. ఇప్పటికే ఓర్వకల్లుకు అగస్త్య, రిలయన్స్ పెట్టుబడులు వచ్చాయన్నారు. సెమీ కండక్టర్ రంగంలో కేంద్ర ప్రభుత్వం 2.0 పాలసీ తీసుకొస్తే రూ.23వేల కోట్ల పెట్టుబడులు ఓర్వకల్లుకు వస్తాయన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్‌తో కలిసి కష్టపడి ఈ పెట్టుబడులు తీసుకొచ్చామని టీజీ భరత్ చెప్పారు. ప్రభుత్వం కంపెనీలతో చేసుకున్న ఎంఓయూలు గ్రౌండింగ్ అయ్యేలా తరచూ పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు వైసీపీ విష ప్రచారం చేస్తోందన్నారు. లేనిది ఉన్నట్లు సృష్టించడం వైసీపీ నైజం అన్నారు. ఆ పార్టీ అగ్ర నాయకత్వం ఎలా ఉంటే కింది స్థాయిలో కూడా నాయకులు అలాగే ఉంటారన్నారు. తమ తెలుగుదేశం పార్టీ పేరు చెబితేనే ఢిల్లీలో ఎంతో గౌరవం ఇస్తారన్నారు. టిడిపి లీడర్‌ని అని చెప్పుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాగే కొనసాగితే అభివృద్ధి జరుగుతూనే ఉంటుందన్నారు. ఇక కర్నూలులో వైసీపీ పరిస్థితి ఎలా ఉందో సొంత పార్టీ నేత మాట్లాడిన ఆడియో లీక్ ద్వారా బయటపడిందన్నారు. వైసీపీ కుట్ర రాజకీయాలు ప్రజలకు తెలియజేయాలని ఆయన క్యాడర్‌ను కోరారు. కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని వార్డులు గెలిచేలా క్యాడర్ పనిచేయాలన్నారు. ప్రజల్లో మంచి పేరున్న నాయకుడికే కార్పొరేటర్‌గా టికెట్ ఇస్తామన్నారు. సర్వేలు చేసిన తర్వాతే అభ్యర్థి ఎన్నిక ఉంటుందన్నారు. ఇక నగరంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులు ఎన్నో జరుగుతున్నాయన్నారు. ఇటీవల గాలివానతో భారీ వర్షం కురిస్తే యుద్ధ ప్రాతిపదికన అధికారులను పరుగులు పెట్టించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. తానెప్పుడూ కర్నూలు ప్రజలకు మేలు చేయాలనే ఆలోచిస్తానన్నారు. సి.క్యాంపు ప్రభుత్వ క్వార్టర్స్‌లో హైకోర్టు బెంచ్ వస్తుందన్నారు. తద్వారా నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నగరంలోని వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమాలకు మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు.

# ప్రకృతి వ్యవసాయ విస్తరణకు రైతులు ముందుకు రావాలి

**భూమిని 365 రోజులు సజీవంగా ఉంచే పీఎండీఎస్ విధానంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

**రసాయన ఎరువుల వినియోగం తగ్గించి భూసారం పరిరక్షించాలి**

**రైతులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపు**





నంద్యాల, మే 27 (శ్రీచక్ర): రసాయన ఎరువుల అధిక వినియోగంతో భూసారం క్షీణిస్తున్న నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ఆచరించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్/ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక "షణ్ముఖ గోఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం" (ఃఖీఅ) ను సందర్శించిన కలెక్టర్, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవామృతాలు, కషాయాలు, బయో ఇన్‌పుట్స్ తయారీ విధానాలను పరిశీలించి నిర్వాహకుడు మహేశ్వర్ రెడ్డిని అభినందించారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 48,500 హెక్టార్లలో 85 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, మొత్తం 3.5 లక్షల మంది రైతుల్లో మరింత మంది ఈ విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్యరంగాల ద్వారా జిల్లా జీడీపీలో సుమారు 42 శాతం ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి నిస్సారమవుతోందని ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్, ముఖ్యంగా డీఏపీ వినియోగంలో నంద్యాల జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం ఆందోళనకరమన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించకపోవడం, ఒకే రకమైన పంటల సాగు, ఖరీఫ్ అనంతరం భూములను ఖాళీగా ఉంచడం వంటి కారణాల వల్ల కూడా భూసారం దెబ్బతింటోందన్నారు. పీఎండీఎస్ (ఖతీవ-ఓనీనిబనీనీని ఆతీఎ వానీలితినిణ) విధానం ద్వారా భూమిని 365 రోజులు పచ్చదనంతో కప్పి ఉంచడంతో పాటు నేలలో సూక్ష్మజీవుల పెరుగుదల, తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడుతాయని కలెక్టర్ వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే ప్రభుత్వం 34 రకాల విత్తనాలతో కూడిన పీఎండీఎస్ కిట్లను అందిస్తున్నదని తెలిపారు. ఈ కిట్లలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, పశువులకు ఉపయోగపడే పచ్చిమేత విత్తనాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు సుమారు 11 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోందని, పీఎండీఎస్ ద్వారా పచ్చిమేత లభ్యత పెరిగితే దీనిని 16 నుంచి 17 లక్షల లీటర్ల వరకు పెంచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్లను పంపిణీ చేసిన కలెక్టర్, ముక్కామల అపర్ణమ్మకు చెందిన పొలంలో నిర్వహించిన విత్తన గుళికల (సీడ్ పెల్లెటైజేషన్) తయారీ ప్రదర్శనను పరిశీలించారు. జీవామృతం, ఘన జీవామృతంతో విత్తనాలను శుద్ధి చేసి గుళికల రూపంలో తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ పద్ధతి ద్వారా విత్తనాల మొలక శాతం పెరగడంతో పాటు ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. తదుపరి అదే పొలంలో పీఎండీఎస్ విత్తనాల వెదజల్లే కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పెద్దఎత్తున ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్ విధానాలను అమలు చేసి భూమిని సజీవంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎఫ్ఎమ్‌టిలు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

# బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, మే 27 (శ్రీచక్ర): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్ ల వద్ద అవసరమైన ఏర్పాట్లు, మరమ్మతులు, నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని పట్టణంలోని నూతన బైపాస్ రోడ్ పరిధిలో ఉన్న బ్లాక్ స్పాట్లను జిల్లా కలెక్టర్ ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే, రవాణా, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుత రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, ప్రజల ప్రాణ రక్షణ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆదోని వై జంక్షన్ నుండి ఆలూరు బైపాస్ వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మాణం చేపట్టినప్పటికీ, ఇంకా కొన్ని కీలకమైన పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ పనులు, వర్షపు నీటి పారుదల కోసం సమగ్ర డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు, విద్యుత్ తీగల మార్పిడి, రోడ్డు భద్రత సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, సైడ్ సిగ్నల్స్, స్పీడ్ వార్నింగ్ బోర్డులు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పనులను వేగవంతం చేయడానికి రెవెన్యూ, నేషనల్ హైవే, రవాణా మరియు పోలీసు శాఖలతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి శాఖ నిర్దేశించిన గడువు లోపు పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సూచించిన అభివృద్ధి, రోడ్డు భద్రత పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంబంధిత శాఖల అధికారులు కలిసి ఆదోని బైపాస్, ఆరెకల్, బనవాసి, చిలకలడోన, మంత్రాలయం మార్గంలోని ప్రమాదకర బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రహదారి పరిస్థితులు, ట్రాఫిక్ ప్రవాహం, హెచ్చరిక సూచికల అవసరం, ప్రమాదాల కారణాలు వంటి అంశాలను సమీక్షించి, తక్షణ భద్రతా చర్యలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా రహదారుల అభివృద్ధితో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, సమర్థవంతంగా పని చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి. పార్థసారథి మాట్లాడుత ఆదోని వై జంక్షన్ వద్ద నిర్మించిన నూతన బైపాస్ రహదారిలో ప్రజల భద్రత, వాహనదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని కీలక మౌలిక సదుపాయాలు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారిపై నీరు నిల్వ కాకుండా ఉండేందుకు సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా రాత్రి సమయంలో ప్రమాదాలు జరగకుండా తగినంత వీధి దీపాల ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించిన కొన్ని చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ? రాష్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని తెలిపారు. దీర్ఘకాలం విరామం లేకుండా వాహనాలు నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని, డ్రైవింగ్ సమయంలో నిద్రమత్తు అనిపిస్తే వెంటనే వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటూనే ప్రజల్లో అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డి, ఆదోని (ఇంచార్జ్) సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, ఆదోని డి.ఎస్.పి (ఇంచార్జ్) భార్గవి, రవాణా శాఖ అధికారి భరత్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, దీప్తి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజలందరూ పరస్పర సహకారంతో, సోదరభావంతో పండుగలు జరుపుకోవాలి

**బక్రీదు పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునే విధంగా గట్టి చర్యలు చేపట్టాలి... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**



అదోని, మే 27 (శ్రీచక్ర): జరగనున్న బక్రీదు పండుగ సందర్భంగా నేడు జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ జిల్లా ముస్లిం సోదరులకు ఆయన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించేందుకు శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ గారిని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా 9121101003 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆదోని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బందోబస్తు విధుల పై ఆదోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పండుగ సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, మసీదులు మరియు ప్రార్థనా స్థలాల వద్ద భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, సామాజిక మాధ్యమాల్లో వదంతుల నియంత్రణ వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని, ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు. పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు కట్టుదిట్టమైన నిఘా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, వదంతులు వ్యాప్తి చేసే వారిపై సైబర్ వింగ్ ద్వారా ప్రత్యేక నిఘా ఉంటుందని, మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఇన్‌చార్జ్ డీఎస్పీ భార్గవి, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, ఆదోని పట్టణ సీఐలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కమనీయం కంబగిరీశుని కళ్యాణం





సంజామల, మే 27 (శ్రీచక్ర): సంజామల మండలం పేరుసోముల గ్రామంలో వెలసిన సుప్రసిద్ధ క్షేత్రం శ్రీ కంబగిరి లక్ష్మీనారసింహస్వామి 16వ వార్షికోత్సవాలలో భాగంగా మూడవరోజు బుధవారం శ్రీ భూ సమేత నృశింహస్వామి కళ్యాణం నేత్రపర్వంగా సాగింది. ముందుగా గోమాతకు పూజానంతరం అహోబిలం క్షేత్ర పండితుడు కిడాంబి వేణుగోపాల్ బృందం నేతృత్వంలో కంబగిరి క్షేత్రం పీఠాధిపతులు శ్రీ రామ్మోహన్ స్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగినది. తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రముఖ వ్యాఖ్యాత, ప్రవచనకర్త డాక్టర్ దీవి హయగ్రీవాచార్యుల కమనీయ వ్యాఖ్యానంతో, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల సంగీతాలాపనలతో, నాదస్వర విన్యాసములతో, ఆద్యంతం భక్తుల ఆనందపారవశ్యాలతో ఈ కార్యక్రమం జరిగినది. మూడురోజులు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీనిత్యతృప్తదాస్ స్వామిచే భగవద్గీత ప్రవచనాలు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీతం, హరికథలు, కూచిపూడి, భరతనాట్యం మొదలైన కళావిన్యాసలతో క్షేత్రం భక్తిసాగరమైనది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలనుండికూడా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తాదులందరికి మహాప్రసాదం అందించారు.

# కట్టుదిట్టమైన భద్రత-అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం

## ఆదోని శివారులో చెక్ పోస్టులను తనిఖీ చేసిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్





అదోని, మే 27 (శ్రీచక్ర): బక్రీద్ పండుగ సందర్భంగా నేడు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ సంధర్భంగా బుధవారం ఆదోని పట్టణ శివారులో ఉన్న ఆలు?రు రోడ్డు ఉన్న చెక్ పోస్టును, శిరుగుప్ప జంక్షన్ ప్రధాన చెక్ పోస్టులను కర్నూలు ఎస్పీ పరిశీలించారు. ఆదోని పట్టణంలో బందోబస్తు విధుల ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ బలగాలతో అదనపు పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, గూడూరు, పత్తికొండ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. గోవుల అక్రమ రవాణా నివారణకు తదితర ప్రాంతాల్లో ప్రధాన చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు పట్టణ శివారులో 8 చెక్ పోస్టులు, ఆదోని పట్టణ శివారులో 4 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు నిరంతర తనిఖీలు చేపడుతున్నారన్నారు. గోవుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో, సోదరభావంతో బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఇన్‌చార్జ్ డీఎస్పీ భార్గవి, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, ఆదోని పట్టణ సీఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

## తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యం:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి






కర్నూలు, మే 27 (శ్రీచక్ర): ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి /జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం నగరం లోని వన్ టౌన్ లో మాసూంబాషా దర్గా, బుధవారపేట లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి, 2002 ఓటర్ల జాబితాను పరిగణ లోకి తీసుకుని 2025 ఓటర్ల వివరాలను సరిపోల్చుకుని ధృవీకరించుకోవాలన్నారు. ఎక్కడా తప్పులు జరగకూడదన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా, తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధంగా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కొన్ని చోట్ల ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదవుతున్నాయని, వాటిని వెంటనే సరిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలోన 142,143,144,145,146, 147 పోలింగ్ కేంద్రాల గురించి తెలుసుకున్నారు. ఃబూ యాప్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆన్లైన్ ప్రక్రియ చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రజలతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితా తయారీలో అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు కావాలని సూచించారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త ను మురికి కాలువల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించి, నగర పరిశుభ్రతకు సహకరించాలని కలెక్టర్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల నమోదు అధికారి మరియు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ంఇఖీూ/కర్నూలు అర్బన్ తహసీల్దార్ రవి, ఎన్నికల విభాగం సూపరినీటెండెంట్ మురళి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, ఎలక్షన్ సూపర్వైజర్ లు, ఃబూ లు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

**రూ.1.67 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**పలు వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పనులకు శ్రీకారం**

**రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్ గుప్తా**



కర్నూలు, మే 27 (శ్రీచక్ర): కర్నూలు నగరం మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా అన్నారు. బుధవారం నగరంలోని పలు వార్డుల్లో రూ. 1.67 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా శంకుస్థాపనలు చేశారు. 9, 10, 11, 12, 13 వార్డుల్లో రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ కాలువల మరమ్మతులు, 600 ఎంఎం సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణం, కమ్యూనిటీ టాయిలెట్ల మరమ్మతులు, ఫిషరీస్ కంపౌండ్ సమీపంలో సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. 1, 2, 6 వార్డుల్లో రూ. 27.49 లక్షలతో సీసీ డ్రైనేజీ కాలువల మరమ్మతులు, కల్వర్టుల పునరుద్ధరణ, సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. 18వ వార్డులో రూ. 49.98 లక్షలతో సీసీ రోడ్డు విస్తరణ, 750 ఎంఎం సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. 14, 15, 16, 17 వార్డుల్లో రూ. 39.84 లక్షలతో బోర్‌వెల్ ఏర్పాటు, హెచ్‌డిపిఈ పైప్‌లైన్ నిర్మాణం, సీసీ డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ.. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం నాడు వీసిన గాలివాన అనంతరం మున్సిపల్, విద్యుత్ శాఖల సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు. చంద్రబాబు సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం హయాంలోనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటుదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ సిటీగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు ఒక్కొక్క సమస్య పరిష్కారించుకుంటు ముందుకెళు_న్నామని పేర్కొన్నారు. రూ. 1.67 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు మూడు వారాల్లో పూర్తి చేస్తామన్నారు. వైజాగ్ తరహాలో నగరాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.

# తారాస్థాయికి చేరిన కర్నూలు వైసీపీలో వర్గపోరు

## కర్నూలు సిటీ వైసీపీ అధ్యక్షుడు అహ్మద్ ఆలీఖాన్




కర్నూలు, మే 27 (శ్రీచక్ర): కర్నూలు వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. రెండు రోజులుగా సామాజిక మధ్యమాల్లో కర్నూలు సిటీ వైసీపీ అధ్యక్షుడు అహ్మద్ ఆలీఖాన్, ఐటిడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ మాట్లాడిన సంభాషణలు వైరల్ మారాయి. ఈసంభాషలో వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ.మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా అహ్మద్ ఆలీఖాన్ మాట్లాడినట్లు ఉంది. దీంతో తెలుగు దేశం పార్టీ నాయకుల కన్న వైసీపీ వాళ్లే తనపై వ్యతిరేకంగా సోషల్ మీడియాలో తనకు వ్యతిరేకంగా అసభ్యంగా ఫోస్టులు పెట్టారని అహ్మద్ ఆలీ ఖాన్ బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈవిషయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ. మోహన్ రెడ్డికి ఫోన్ చేసిన ఎత్తలేదని ఆలీ ఖాన్ తెలిపారు. ఎస్వీ మోహన్ రెడ్డి అనుచరులు తనపై తన కుటుంబంపై అసభ్యంగా ఫోస్టులు పెట్టడం తనకు ఇబ్బంది పెట్టిందన్నారు. కర్నూలులో మైనారిటీ నాయకులు ఎదగకుండా ఎస్వీ. మోహన్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని అహ్మద్ ఆలీ ఖాన్ అన్నారు. ఇన్ని రోజులుఎన్నిఅవమానాలుచేసినభరించాననిఇకపై అలా ఉండదన్నారు. రేపటి నుంచి ఇంటింటికి తిరిగి తన సత్తా ఎంటో చూపిస్తానన్నారు.

# ప్రీతీబాయ్ కేసు విషయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో అండగా ఉన్నారు కర్నూలు జనసేన ఇంచార్జ్ అర్షద్



కర్నూలు, మే 27 (శ్రీచక్ర): కర్నూలు ప్రీతీబాయ్ కేసు విషయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో అండగా ఉన్నారని కర్నూలు జనసేన ఇంచార్జ్ అర్షద్ అన్నారు. కర్నూలు లోని ఓ ప్రైవేటు హోటల్లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అర్షద్ మాట్లాడుతూ ప్రీతీబాయ్ విషయంలో న్యాయం జరగాలని కర్నూలులో పవన్ కళ్యాణ్ భారీ ర్యాలీ మరియు బహిరంగ సభ నిర్వహించారన్నారు. ప్రీతీబాయ్ తల్లిదండ్రులకు అన్ని విధాల కర్నూలు జిల్లా జనసేన నాయకులు అండగా ఉన్నామన్నారు. వైసీపీ హాయంలో ప్రీతీబాయ్ కేసులో ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. తనపై ఏడు కేసు లు పెట్టి వేధించారని అర్షద్ తెలిపారు. తనపై వేధింపులను బరించలేక తనభార్య ఆత్మహత్యయత్నం చేసుకుందన్నారు. జనసేన పోరాటం వల్లే ప్రీతీబాయ్ తల్లి దండ్రులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలు అందాయని తెలిపారు. ప్రభుత్వం తరపున ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం ప్రీతీబాయ్ తల్లిదండ్రులకు అండగా ఉందని న్యాయ వ్యవస్థ పరిధిలో ఉన్న కేసులో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అర్షద్ తెలిపారు. ఇంత చేసిన ఇప్పుడు ప్రీతీబాయ్ తల్లి పార్వతి భాయ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలవడం సరికాదన్నారు.

# ఇంటికన్నం దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

**13 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం**

**కర్నూలు 4 వ పట్టణ సీఐ విక్రమ్ సింహ సింహ**

కర్నూలు, మే 27 (శ్రీచక్ర): కర్నూల్ పట్టణం ఉద్యోగ నగర్ లో నివాసముండే తెలుగు చిన్న రంగడు కుటుంబ సమేతంగా కేదార్నాథ్ వెళ్లగా ఏప్రిల్ 21వ తేదీన సదరు చిన్న రంగడు ఇంటికి వేసి ఉన్నటువంటి తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి వారు బీరువాలో దాచుకున్న సుమారు 13 తులాల బంగారు ఆభరణాలు మరియు కొంత నగదు దొంగలించి కు వెళ్లారు అని చిన్న రంగడు ఇచ్చినటువంటి ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. సదరు దొంగతనానికి పాల్పడినటువంటి ముద్దాయి ల యొక్క ఆచూకీ గురించి విచారిస్తుండగా సదరు దొంగతనానికి పాల్పడినటువంటి వ్యక్తులు తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందినటువంటి అబ్దుల్ మతిన్ మరియు పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామం నివాసస్థుడైన దేవరశెట్టి శివకృష్ణగా తెలియ వచ్చింది. సదరు ఇద్దరు ముద్దాయిలను ఈ నెల 26 న మునగాలపాడు గ్రామ శివారులో అరెస్టు చేసి వారిద్దరి ని రిమాండ్ కు తరలించడం జరిగింది. సదరు అబ్దుల్ మతిన్ పై మహబూబ్నగర్, జడ్చర్ల హైదరాబాద్, సదాశివపేట మొదలగు పోలీస్ స్టేషన్ లలో సుమారు 6 కు పైగా కేసులు కలవు. అదేవిధంగా శివకృష్ణ మీద కూడా జడ్చర్ల, మహబూబ్ నగర్ పోలీస్ స్టేషన్ లలో మూడుకు పైగా కేసులు నమోదు అయ్యాయి. హైదరాబాద్ లో అబ్దుల్ మతీన్ మొదట్లో ఐఐటీ సంగారెడ్డి లో ట్రాన్స్పోర్ట్ సూపవైజర్ గా పనిచేస్తున్న క్రమం లో ఒక అమ్మాయి విషయంగా గొడవపడి గా సదాశివపేట లో ఇతని పై హత్యాయత్నం కేసు మరియు ఒక మైనర్ అమ్మాయి పై అఘాయిత్యం చేసినందుకుగాను పోక్సో కేసు కూడా నమోదవ్వగా, రిమాండ్ కి వెళ్లి, బెయిల్ పై బయటికి వచ్చి అటు నుండి ఉద్యోగాన్ని కోల్పోయి చెడు అలవాట్లకు లోనయ్యి ఆ సమయం లో పరిచయమైన పాములపాడు మండలం యర్రగూడూరు గ్రామస్థుడైనా దేవరశెట్టి శివకృష్ణ తో కలిసి వారి విలాస జీవితానికి అప్పులు చెయ్యడం, ఆ అప్పులను తీర్చే క్రమంలో దొంగలుగా మారడం జరిగింది. వీరి నుండి దొంగతనం చేసినటువంటి బంగారు ఆభరణాల యొక్క రికవరీని ఇంకా చేయాల్సి ఉంది. కర్నూలు 4 వ పట్టణ సీఐ విక్రమ్ సింహ ఆధ్వర్యంలో సదరు కేసులో ఎస్ఐ గోపినాథ్, పీసీ సుబ్బారాయుడు మరియు పీసీ మురళిలు ప్రత్యేక బృందంగా ఏర్పడి ముద్దాయిలను పట్టుకువడం లో చురుకుగా వ్యవహరించారు.



# మార్కాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకారం అందిస్తాం

## డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వినయ్ కాంత్

మార్కాపురం మే 27 (శ్రీ చక్ర)మార్కాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని గుంటూరు రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ డి. వినయ్ కాంత్ హామీ ఇచ్చారు. మార్కాపురం రైల్వేస్టేషన్ పరిశీలన నిమిత్తం గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు విచ్చేసిన సందర్భంగా మార్కాపురం ప్రయాణీకుల సంఘం పలు సమస్యలు, అభ్యర్థనలను వారి దృష్టికి తీసుకెళ్లగా వాటిపై సానుకూలంగా స్పందిస్తూ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ డి. వినయ్ కాంత్ ప్రయాణీకుల సంఘ అధ్యక్షుడు ఓరుగంటి మల్లిక్కు లేఖ ద్వారా పలు హామీలు ఇచ్చినట్లు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మార్కాపురం రైల్వేస్టేషన్ ను ఆధునీకీకరించే పనులు వేగంగా కొనసాగు తున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా స్టేషన్ పరిసర ప్రాంతమైన సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మార్కాపురం నుండి వెళ్లే ఆర్టీసీ బస్సుల వివరాలు, వాటి సమయాలను తెలియజేసే సమాచార బోర్డులు ఏర్పాటు చేయగలమని, ముఖ్యంగా మార్కాపురం రైల్వేస్టేషన్ నుండి శ్రీశైలం వరకు నేరుగా ప్రయాణించే. భక్తులు, ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ అధికారులతో పాటు మార్కాపురం డిపో మేనేజర్ను కోరినట్లు తెలిపారు. అమృత్ భారత్ పథకం రెండో దశ పనులలో భాగంగా స్టేషన్ పశ్చిమ వైపున రెండవ ప్రవేశ, నిష్క్రమణ మార్గాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం మొదటి దశ పనుల్లో భాగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం, ప్లాట్ఫాం సర్ఫేసింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా కొత్త స్టేషన్ భవనం.మ్మాణం, ప్రయాణీకుల సౌకర్యాల విస్తరణపై పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. స్టేషన్లో రైలు సూచిక బోర్డులు, కోచ్ సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కూడా చేపట్టినట్లు వివరించారు. కొత్త రైళ్ల ప్రవేశపెట్టడం అంశంపై కూడా అధికారులు స్పందించినట్లు ఓరుగంటి మల్లిక్ తెలిపారు. ప్రస్తుతం పొదుగురాళ్ల రైల్వే లైన్ పూర్తయిందని, శావల్యాపురం? పిడుగురాళ్ల కొత్త రైల్వే లైన్లో కొత్త రైళ్ల.ప్రవేశపెట్టడంపై.సాధ్యాసాధ్యాలు, వాణిజ్యపరమైన లాభదాయకతను అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ నడికుడి ప్యాసింజర్ రైలును మార్కాపురం వరకు పొడిగించాలన్న విజ్ఞప్తిపై ప్రస్తుతం విరామ.సమయం.సరిపోకపోవడంతో అది సాధ్యం కాదని తెలిపారు. కొండవీడు ఎక్స్ప్రెస్సు వారానికి మూడుసార్ల నుంచి రోజువారీగా నడపాలన్న అభ్యర్థనపై.ప్రధాన.కార్యాలయానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.అలాగే.గుంటూరు–ఔరంగాబాద్ ఎక్స్ప్రెస్ను నాగర్సోల్ వరకు పొడిగించాలన్న అంశాన్ని పరిశీలిస్తామని, గుంటూరు– తిరుపతి ఎక్స్ప్రెస్సు తిరుచిరాపల్లి వరకు పొడిగించే అంశం సంబంధిత ఇతర రైల్వే డివిజన్ల పరిధిలో ఉందని స్పష్టం చేశారు. మార్కాపురం రైల్వేస్టేషన్లో ప్రయాణీకుల సౌకర్యాలను మరింత మెరుగుపరచడమే కాకుండా రైల్వే ఆదాయం పెంచే దిశగా ప్రధాన ఎక్స్ప్రెస్ రైళ్ల బుకింగ్ సౌకర్యాలను కూడా కల్పించనున్నట్లు వినయ్ కాంత్ తెలిపారని ఓరుగంటి మల్లిక్ వెల్లడించారు. టికెట్ విక్రయాల సమయంలో రద్దీ ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకునే అధికారాన్ని స్టేషన్ మాస్టర్కు కల్పించినట్లు ఆయన తెలిపారు. మార్కాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి అధికారులు ఇచ్చిన హామీలతో ప్రయాణీకుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.




## భగత్ సింగ్ కాలనీలో పర్యటించిన జిల్లా కలెక్టర్ విజయ సునీత




మార్కాపురం మే 27( శ్రీ చక్ర)మార్కాపురం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీ నందు జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ సునీత జనగణన మరియు కాలనీ పట్టాల విషయంలో భాగంగా ఈరోజు పర్యటించడం జరిగింది రెవెన్యూఅధికారులుఆర్డిఓశివరాంరెడ్డిమరియుఎమ్మార్వో చిరంజీ.సచి. వాలయంసిబ్బంది కి పలు సూచనలు చేసిన కలెక్టర్అలాగే మౌలిక వసతులు పై ఆరా తీశారు కాలనీలలో మౌలిక వసతులను వెంటనే చేపట్టాలనిఆమె అన్నారు ఈ కార్యక్రమంలో16వ మాజీ కౌన్సిలర్ హర్షిత బాబి 16 వార్డు ఇన్చార్జి చల్లగాలి విద్యాసాగర్ సీనియర్ టిడిపి నాయకులు కాయకాకుల తిరుపతయ్య సీనియర్ నాయకులు పంట చిన్న సుబ్బారావు పొన్నతోట శ్రీనివాస్ ఆచారి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## పేద ముస్లిం మహిళలకు బక్రీద్ తోఫా



కర్నూలు స్పోర్ట్స్, మే 27 (శ్రీ చక్ర ) :కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్ లో గల శ్రీ గురుదత్త పాలిక్లినిక్ లో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ నిరుపేద ముస్లిం మహిళలకు బుధవారం బక్రీద్ సందర్భంగా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ పండగలను అందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. భిన్నత్వంలో ఏకత్వంగా భారతదేశం ఉందని ఇక్కడ ఉన్న వారు కలిసి మెలిసి ఉండాలన్నారు. బక్రీద్ సందర్భంగా పేదలకు సహాయం చేయాలన్న ఉద్దేశ్యంతో నిత్యవసర సరుకులు అందించానని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయని వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. మంచి ఆహారం, తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా ప్రారంభమైన మహానాడు-2026-తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు-2026 - నియోజకవర్గంలోని 10 క్లస్టర్లలో ఎంతో విజయవంతంగా, భారీ స్థాయిలో కొనసాగింది.



మంత్రాలయం, మే27, (శ్రీచక్ర) :మహానాడు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముందుగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, తెలుగుదేశం జిందాబాద్" అంటూ నినాదాలతో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి ,మంత్రాలయం అబ్జర్వర్ కెసి హరి , మాధవరం మాజీ సర్పంచ్ శ్రీ ఎన్. రఘునాథ్ రెడ్డి , ఎన్. రామకృష్ణ రెడ్డి , రాకేష్ రెడ్డి. ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మంత్రాలయం టౌన్ లో మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. అలాగే మిగతా మూడు మండలాల్లో కూడా డిజిటల్ స్క్రీన్ల ఏర్పాటుతో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామాలయం నిర్మాణానికి రూ.3 లక్షల చెక్కు అందజేత

కాజులూరు, మే 27( శ్రీచక్ర)రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం ఆండ్రంగి గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ కోదండరామ దేవాలయం అభివృద్ధికి మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం రూ.3 లక్షల రూపాయల చెక్కును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన ఈ నిధులతో దేవాలయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి వినియోగించాలని సూచించారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దేవాలయాలు ప్రతీకలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. శ్రీ కోదండ రామాలయం నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మరింత ఆధ్యాత్మిక వాతావరణం కలుగుతుందని తెలిపారు.కూటమి ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, హిందూ ధార్మిక సంస్థల అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

### -మాధవరం హౌసింగ్ లే ఔట్ లో రోడ్డు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటాం-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




మంత్రాలయం,మే 27, (శ్రీచక్ర) : ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, హౌసింగ్ లే ఔట్ లో రోడ్డు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. బుధవారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలోని హౌసింగ్ లే ఔట్ ను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ హౌసింగ్ లే అవుట్ ను పరిశీలిస్తూ, అక్కడే ఉన్న లబ్ధిదారులు సుగుణ, ఈరన్న, జమ్మయ్య లతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారులను ఆరా తీశారు.. కరెంట్, నీటి సౌకర్యం ఉన్నాయని రోడ్డు సమస్య ఉందని రోడ్డు వేయించాలని లబ్దిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు..రోడ్డు వేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. హౌసింగ్ లే ఔట్ లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హౌసింగ్ పీడీని ఆదేశించారు.. లబ్ధిదారులను మోటివేట్ చేసి ఇళ్లను త్వరగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలన్నారు. అవసరమైన చోట రుణాలు ఇప్పించాలని, దశలవారీగా పర్యవేక్షిస్తూ ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి నరసింహా రెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, మంత్రాలయం తహసిల్దార్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో ఘనంగా డిజిటల్ మహానాడు

### జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన శ్రీనివాస్ రెడ్డి



మంత్రాలయం మే 27(శ్రీచక్ర) : నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో వాసవి కల్యాణ మండపం లో టీడీపీ డిజిటల్ మహానాడు కార్యక్రమం టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్చార్జ్ యల్లారెడ్డి అధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అదేశాల మేరకు ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్రకార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా టిడిపి జెండా ఆవిష్కరణ చేసి టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం అమర్నాథ్ రెడ్డి, క్రిష్ణా వెూహన్ రెడ్డి,విజయురామిరెడ్డి, నర్సారెడ్డి,వట్టేప్ప నరసింహులు,వగరూరు అబ్దుల్ సాబ్,లక్ష్మారి రామయ్య,మాలపల్లి భీమన్న ఆచారి,సుగూరు ఈరన్న, సుజ్ఞానాం , యస్ సి సెల్ నాయకులు యోబు,రవి, భీమన్న, హనుమంతు,సాయి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల తర్వాత చిన్న బొంపల్లె చెరువుకు చేరిన నీరు..

**-భూగర్భ జలాల పెంపుదలకు వినూత్న అడుగు..**
**- ఇంకుడు గుంతల ద్వారా నీటి సంరక్షణ-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మంత్రాలయం,మే 27(శ్రీచక్ర) : జలధార జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన ఫీడర్ పనుల ద్వారా 20 ఏళ్ల తర్వాత చిన్న బొంపల్లె చెరువుకు





నీరు చేరడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.బుధవారం కోసిగి మండలం చిన్న బొంపల్లె, పల్లెపాడు గ్రామంలో జలధార జల హారతి కింద చేపట్టిన పనుల ఫలితంగా 20 సంవత్సరాల అనంతరం చెరువుకు వచ్చిన నీటిని బలవన వాగుకు సంబంధించిన ఫీడర్ ఛానెల్ పనులను రిటెన్షన్ పిట్స్ పద్ధతిలో చేపట్టి, ఇటీవల కురిసిన వర్షానికి పిట్స్ నిండడంతో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న జలధార జల హారతి కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. కోసిగి మండలం చిన్న బొంపల్లె, పెద్ద బొంపల్లె మధ్య ఉన్న చెరువుకు ఫీడర్ పనులు పూర్తి కావడంతో ఇటీవల కురిసిన వర్షపు నీరు చెరువులోకి చేరిందన్నారు. రెండు ఫీడర్ల పనులు పూర్తవడంతో చిన్నపాటి జల్లులకే నీటి ప్రవాహం చెరువులోకి చేరిందన్నారు. ఇంకా భారీ వర్షాలు కురిస్తే చెరువు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందన్నారు. దీని వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి, బోర్లలో నీటి మట్టాలు మెరుగుపడతాయన్నారు. రైతులకు వ్యవసాయ అవసరాలకు, పశువులకు నీరు అందుబాటులో ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత రోజుల్లో నీటి కొరతను అధిగమించడానికి, భూగర్భ జల మట్టాలను పెంచడానికి నీటి నిల్వ మరియు ఇంకుడు గుంతల వ్యవస్థ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా చేపట్టిన పూడికతీత, నీటి సంరక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. చిన్న బొంపల్లె చెరువులో ప్రస్తుతం 24 పిట్స్ పూర్తి చేయగా, మొత్తం 60 పిట్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు . ప్రతి పిట్ సుమారు 1.2 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో ఉండటంతో, ఇటీవల కురిసిన రెండు రోజుల వర్షాలకు దాదాపు 56 వేల లీటర్ల నీటిని సంరక్షించినట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా పల్లెపాడు గ్రామంలోని బలవన వాగులో చేపట్టిన ఫీడర్ పనుల ద్వారా 76 ఇంకుడు గుంతల ఏర్పాటు ద్వారా ప్రతి గుంత ద్వారా దాదాపు 4,800 లీటర్ల వర్షపు నీటిని నిల్వ చేసి, భూమిలోకి ఇంకేలా చేశామన్నారు. 2 రోజులు వర్షాలు పడడం ద్వారా ఒక్కో గుంత ద్వారా 9,600 లీటర్ల నీరు భూగర్భంలోకి చేరిందన్నారు. ఈ విధంగా మొత్తం రికార్డు స్థాయిలో 7,29,600 లీటర్ల (7.29 లక్షల లీటర్లు) నీటిని భూగర్భంలోకి పంపి, నిల్వ చేయడం జరిగిందన్నారు. " నిలుపుదల గుంటలు వ్యవస్థ ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా నేరుగా భూమిలోకి చేరుతుందన్నారు. ఇది రాబోయే రోజుల్లో చుట్టుపక్కల ప్రాంతాల్లో బోరు బావులు, బావుల్లో నీటి మట్టాలు పెరగడానికి ఎంతో సహాయపడుతుందన్నారు. ప్రకృతి ప్రసాదించిన ప్రతి నీటి బొట్టునూ సంరక్షించడమే లక్ష్యం అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విధానం రాష్ట్రంలో ఎక్కడా అమలు కాలేదని, జిల్లాలో తొలిసారిగా చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, డ్వామా పిడి నరసింహా రెడ్డి , ఇరిగేషన్ డిఈ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# త్రాగు నీరు సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

**కాజులూరులో త్రాగునీటి సమస్యతో ప్రజలు ఆందోళన**
**నిమ్మకు నీరు ఎత్తినట్టు ప్రవర్తిస్తున్న అధికారులు తీరు**
**తీరు మారకుంటే జనతా వారిధి ద్వారా ఏకకాలంలో ఫిర్యాదులకు సిద్ధం**
**కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు**



కాజులూరు, మే 27 (శ్రీచక్ర)కాజులూరు మండలంలో మంచినీటి సమస్య తారాస్థాయిలో ఉందని దీనిపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన మంచినీరు ప్రజలకు అందించే ఏర్పాట్లు చేయకపోతే, జనతా వారది ద్వారాఏకకాలంలో బిజెపి తరఫున ఫిర్యాదులు చేయనున్నట్లు కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల కేంద్రమైన కాజూలూరులో పలువురు బిజెపి శ్రేణులతో సమావేశమై మండలంలో త్రాగునీటి సమస్యపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే మండలంలో తాగునీరు సమస్య తారస్థాయిలో ఉందని దీనిపై అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నారే తప్ప ప్రజలకు సకాలంలో నీరు అందించే ప్రయత్నం మాత్రం చేయడం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా త్రాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని కోట్లాది రూపాయలు తో పలు ప్రాజెక్టులు ఇంటింటికి కులాయి అనే పేరుతో చేస్తున్నప్పటికీ త్రాగునీరు అందించడంలో ఆయా చోట్ల అయితే మాత్రం అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు . ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల త్రాగునీటి సమస్యపై పరిశీలించమని ముఖ్యంగా కాజులూరు మండలం గొల్లపాలెం నందు భారీ ప్రాజెక్టు వినియోగంలో ఉన్నప్పటికీ ప్రజలకు అందించే త్రాగునీరు విషయంలో అధికారులు నిర్లక్ష్యం ద్వారా సకాలంలో మంచినీరు అందించలేక పోతున్నారని వీరబాబు ఆరోపించారు. గత రెండు సంవత్సరాలుగా త్రాగునీర విషయంలో తాను ప్రత్యేకించి అధికారుల దృష్టి తీసుకెళ్లినప్పటికీ అదిగో ఇదిగా అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప స్పష్టంగా త్రాగునీరు విషయంలో ప్రజలకు తృప్తిని ఇవ్వలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. నిత్యం ఏదోచోట త్రాగునీటి సమస్యపై ప్రజలు గగ్గోలు పెడుతున్నారని ప్రధానంగా అధికారులు వేసవి దృష్టిలో ఉంచుకుని ఏ విధమైన ప్రత్యామ్నాయమా ఏర్పాట్లు చేయకపోవడం విచారకరమన్నారు. కాజులూరు మండలంలో పలు గ్రామాల్లో మంచినీటి సమస్యలపై అధికారులు తీరు హాస్యాస్పదంగా ఉందని వీరబాబు పేర్కొన్నారు. ప్రజల్లో ఇప్పటికే మంచినీటి సమస్యపై ఒక అలజడి మొదలైందని త్వరలో సమస్యను పరిష్కరించకపోతే మాత్రం కాకినాడ జిల్లా కలెక్టరేట్, అమలాపురం జిల్లా కలెక్టరేట్, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులకు, స్థానిక శాసనసభ్యులు వాసంశెట్టిసుభాష్ కి ,ఒకేసారి జనతా వారధి ద్వారా ఫిర్యాదులు పంపవలసి ఉంటుందని ఈ సందర్భంగా వీరబాబు హెచ్చరించారు.

# శాస్త్రీయ విత్తన శుద్ధితో వరి సాగులో అధిక దిగుబడులు

**ముందస్తు వరి సాగు కోసం రైతులు సిద్ధం కావాలి**
**వేరు సరిగా లేని విత్తనాలను వాడవద్దు**
**తక్కువ మొలకెత్తే విత్తనాలను అమ్మడం చట్టరిచ్చా నేరం**
**శుద్ధి చేసిన విత్తనాలను ఎండలో పెట్టవద్దు**
**శుద్ధి చేసిన విత్తనాలను తినడానికి ,పశువులకు వాడవద్దు**
**వ్యవసాయ సహాయ సంచాలకులు.నాగకమార్**



రామచంద్రపురం, మే 27( శ్రీచక్ర)ప్రస్తుత సాగు సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని వరి సాగు చేసే రైతులు ఆశించిన మేర దిగుబడులు సాధించాలంటే విత్తన నాణ్యత, ముందస్తు మొలక శాతం పరీక్ష, విత్తన శుద్ధి అత్యంత కీలకమని రామచంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ సూచించారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన ద్వారా రామచంద్రపురం పరిసర ప్రాంతాల రైతులకు అవగాహన మేరకు తెలియజేసారు. విత్తనం నేల ద్వారా ఆశించే తెగుళ్లు, పురుగులు మరియు శిలీంధ్రాల నుండి మొలకెత్తే మొక్కలను కాపాడటానికి విత్తన శుద్ధి ఒక 'రక్షణ కవచం' లాగా పనిచేస్తుందని పేర్కొన్నారు. వరి రైతుల అవగాహన కోసం ముఖ్యమైన సమాచారంతో పాటు మార్గదర్శకాలు వివరించారు. మార్కెట్లో కొనుగోలు చేసిన లేదా సొంతంగా నిల్వ ఉంచుకున్న వరి విత్తనాలను నారుమడి పోయడానికి ముందే మొలక శాతం పరీక్షించుకోవాలని సూచించారు. వరి పంటకు కనీస మొలక శాతం 80శాతం నుండి 85 శాతం ఉండాలని తెలిపారు .ఒక శుభ్రమైన కాటన్ గుడ్డను నీటితో తడిపి, అదనపు నీటిని పిండి దానిపై వరుసగా 100 వరి విత్తనాలను అమర్చి, గుడ్డను చుట్టి ప్లాస్టిక్ కవర్లో లేదా నీడ పట్టున ఉంచాలని, గుడ్డ ఆరిపోకుండా రోజువారీగా కొద్దిగా నీరు చల్లుతూ తేమను కాపాడాలని అన్నారు. అంతర్జాతీయ విత్తన పరీక్షా ప్రమాణాల ప్రకారం వరి విత్తనాల మొలకల లెక్కింపును విత్తనాలు తడిపెట్టిన 5వ రోజునఒకసారి గుడ్డ విప్పి చూసి, వేగంగా, బలంగా మొలకెత్తిన సాధారణ మొలకలనుగుర్తించి లెక్కించాలన్నారు. 10వ రోజు సరిగ్గా తుది లెక్కింపు చేపట్టాలని,ఆ రోజు పరిపూర్ణమైన వేరు వ్యవస్థ, కాండం, ఆకులు ఉన్న సాధారణ మాత్రమే పూర్తిగా లెక్కించాలని,వేరు సరిగ్గా లేని అసాధారణ మొలకలను, కుళ్ళిపోయిన లేదా అస్సలు స్పందన లేని చనిపోయిన విత్తనాలను లెక్కింపులోకి తీసుకోకూడదని సూచించారు .10వ రోజున వచ్చిన సాధారణ మొలకల సంఖ్య పరీక్షించిన తరువాత 100 విత్తనాలకు10వ రోజు నాటికి 85 ఆరోగ్యకరమైన మొలకలు వస్తే, మొలక శాతం 85 శాతం అవుతుందని పేర్కొన్నారు. విత్తన నియంత్రణ చట్టం ప్రకారం నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువ మొలక శాతం ఉన్న విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. మొలక శాతం సరిగ్గా ఉన్న విత్తనాలకు నాటడానికి ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని,దీనివల్ల తెగుళ్ల నివారణతో పాటు, అధిక మొలక శాతం, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం మరియు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి మొక్కలకు లభిస్తుందని సూచించారు. కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ ,వంటి మందులను కిలో విత్తనానికి 2?3 గ్రాముల చొప్పున కలిపి శుద్ధి చేయాలని తెలిపారు. రసాయన శుద్ధి చేసిన వెంటనే జీవ ఎరువులను కలపకూడదని రసాయన శుద్ధి చేసిన ×2?3 గంటల తర్వాత లేదా మరుసటి రోజు మాత్రమే జీవ ఎరువులను వాడాలన్నారు. శుద్ధి చేసిన విత్తనాలను ఎల్లప్పుడూ నీడలోనే ఆరబెట్టాలని,ఎట్టి పరిస్థితులల్లోనూ ఎండలో పెట్టకూడదని పేర్కొన్నారు. రసాయనాలతో విత్తన శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముక్కుకు మాస్క్ తప్పనిసరిగా ధరించాలి. శుద్ధి చేసిన విత్తనాలను తిండికి గానీ, పశువుల మేతకు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని తెలియజేశారు. ఈ విత్తనాలను కేవలం విత్తడానికి మాత్రమే వాడాలి న్నారు. గోదావరి డెల్టా ప్రాంత వాతావరణ మార్పులను తట్టుకోవడానికి మరియు వరిలో అగ్గితెగులు , కాండం తొలిచే పురుగు వంటి ముందస్తు సమస్యలను నారుమడి దశ నుంచే నివారించడానికి విత్తన శుద్ధి ఏకైక చౌకైన, శాస్త్రీయ మార్గం. కావున, వరి రైతులందరూ తప్పనిసరిగా 5 మరియు 10 రోజుల వ్యవధిలో మొలక శాతం పరీక్షించి, ఆపై విత్తన శుద్ధి చేసిన తర్వాతే నారుమడులు పోసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ అధికారులు సూచనలు సలహాలు పాటించాలని ఈసంధర్భంగా ఎంబిఎ నాగ కుమార్ పేర్కొన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ టిడిపి


**తెలుగుజాతికి గర్వించదగ్గ వ్యక్తి అన్న ఎన్టీఆర్**
**సంక్షేమానికి ఆధ్యుడు దివంగత నేత ఎన్టీఆర్**
**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్**





రామచంద్రపురం,మే,27( శ్రీచక్ర) తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి దివంగత నేత డాక్టర్ నందమూరి తారకరామారావు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామచంద్రపురంలో క్లస్టర్-1, క్లస్టర్-2 అధ్వర్యంలో నిర్వహిస్తున్న "మహానాడు " కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ తన స్వగృహం నుంచి సైకిల్ తొక్కుతూ మహానాడు వేదిక వద్దకు పార్టీ శ్రేణులతో చేరుకున్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి నందమూరి తారక రామారావు విగ్రహానికి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహానాడు అనేది కేవలం రాజకీయ సభ మాత్రమే కాదని, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పేద ప్రజల సంక్షేమం, తెలుగు వారి గౌరవం కోసం ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు, రైతులకు ప్రోత్సాహం, మహిళల సాధికారత, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వివరించారు. మహానాడు కార్యక్రమాలు పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. మంత్రి లోకేష్ యువగళం పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాలను మార్చేశారని ప్రశంసించారు. యువతకు స్ఫూర్తిగా, ప్రేరణగా నిలుస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గత వైసిపి పాలన అంతా చీకటిమయం, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్, పరిపాలన దక్షత, అపారమైన నమ్మకంతో తెలుగుదేశం పార్టీకి విజయం చేకూర్చారన్నారు. అభివృద్ధి సంక్షేమనీ సమపాళ్లలో నిర్వహిస్తూ రాష్ట్రాన్నే అభివృద్ధి పథంలో తీసుకెళు _న్నారన్నారు. చివరగా పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు.

**నాణ్యమైన విద్య మెరుగైన ఉత్తమ ఫలితాలకు ప్రభుత్వ పాఠశాలలే ఆదర్శం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిపిలుస్తుంది, కార్యక్రమం పై ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపు**





వరదయ్యపాలెం మే 27(శ్రీ చక్ర) పిచ్చాటూరు మండలంలో సత్యవేడు శాసనసభ్యులుకోనేటిఆదిమూలంపర్యటించారు పిచ్చాటూరు మండల ంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడి పిలుస్తోంది కార్యక్రమంలో, ఎమ్మెల్యే కోనేటిఆదిమూలంముఖ్యఅతిథిగాపాల్గొన్నారు బుధవారం అనగా 27-05-2026 న ఉదయం 8:00 గంటలకు పిచ్చాటూరు మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ వారి బృందం మరియు స్థానిక శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం వారి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తదనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మరియు జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి బడి పిలుస్తోంది,కార్యక్రమంను ప్రారంభించారువిద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకోవాలని,పిచ్చాటూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కల్గిన ఉపాధ్యాయులు మరియు అన్ని వసతులు కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం చేశారు బడి పిలుస్తుంది కార్యక్రమమును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మరియు జిల్లా విద్యాశాఖ అధికారి జెండా ఊపి ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పిచ్చాటూరు లోని ఆంజనేయ స్వామి దేవాలయం వరకు పెద్ద ఎత్తున విద్యార్థులు తల్లిదండ్రులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. కార్యక్రమమునకు మండలం లోని ఎం ఇ ఒ ఎంపిడిఓ, ఎం ఆర్ ఒ , ఎన్డీయే కూటమి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, అన్నిశాఖల మండల అధికారులు మరియు గ్రామ స్థాయి అధికారులు, వివిధ స్థాయి సంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్ లు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు హాజరైనారు .

**కె వి బి పురం మండలం,ఆరె గ్రామ వాస్తవ్యులు ఓళ్ళూరు దాము రెడ్డి కుమార్తె రిసెప్షన్ కు హాజరైన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**





వరదయ్యపాలెం మే 27(శ్రీ చక్ర) నాగలాపురం మండలం, టి ఆర్ ఆర్ కళ్యాణ మండపం నందు జరిగిన ఓళ్ళూరు దాము రెడ్డి గారి కుమార్తె రిసెప్షన్ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం హాజరై వధూవరులను ఆశీర్వధించారు

# హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ కోఆర్డినేటర్ గా గోపాలుని హరి రావు



మార్కాపురం మే 27 ( శ్రీ చక్ర)మార్కాపురం హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మార్కాపురం జిల్లా కోఆర్డినేటర్ గా గోపాలుని హరి హర రావు. హిందూ దార్మిక కార్యక్రమం లు నిర్వహించుటకు, ప్రచారం చేయుట కొరకు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ హెచ్. డి. పి. టి. మార్కాపురం జిల్లా కోర్డినేటర్ గా గోపాలుని హరి హర రావు రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ గారిని హెచ్. డి. పి. టి., ఏ. పి. స్టేట్ చైర్మన్ గారైన డాక్టర్. దాసరి శ్రీనివాసులు ఐ. ఏ. స్.గారు నియమించినారు. వారి నియామకానికి హరి హర రావకృతజ్ఞతలు తెలిపినారు. హరి హర రావు గత 30 సంవత్సరాలనుండి మార్కాపురం లో హిందూ దార్మిక కార్యక్రమం లు, అనేక సామాజిక సేవా కార్యక్రమం లు నిర్వహిస్తూన్నారని షిర్డీ సాయి బాబా మందిరం, దత్త మందిరం, చంద్ర మౌళి శ్వర దేవాలయం నిర్మాణం లో ప్రముఖ పాత్ర వహించ్చారని, దోర్నాల మండలం యడవలి గ్రామం నందు స్వయంబు తిరుమల నాధ స్వామి దేవాలయం పునర్నిర్మాణం జరిపిస్తున్నారని, మార్కాపురం పట్టణం లోప్రతి సంవత్సరం నిర్వహించు గీత జయంతి, కార్తీక దీపోత్సవం, హనుమాన్ శోభ యాత్ర తదితర కార్యక్రమం లో ప్రముఖ పాత్ర వహిస్తూ అనేక దార్మిక కార్యక్రమం లు నిర్వహిస్తున్నారని వీరి నియామకం ఎంతో ఆనంద దాయకమని వీరి ద్వారా మార్కాపురం జిల్లా లో భవిష్యత్ లో అనేక హిందూ దార్మిక కార్యక్రమం లు జరుగుతాయని ఆశిస్తూ మార్కాపురం జిల్లా బి.జె. పి. అధ్యక్షులు పి. వి. కృష్ణ రావు గారు, అగ్ని న్యూస్ సంపాదకులు కాళం రాజు రామకృష్ణ గారు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడిశెట్టి వీరా రావు, హనుమాన్ శోభ యాత్ర కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి గారు అభినందించారు. వీరి నియామకమునకు షిర్డీ సాయి బాబా మందిరం అధ్యక్షులు పేరం సత్యనారాయణ , కోశాధికారి జూలశ్రీనిల నాగరాజు గారు, శివాలయం మాజీ చైర్మన్ వాలిచర్ల కేశవ రావు,ఎన్. జి. ఓ. అధ్యక్షులు బి.వి. యస్. శాస్త్రి గారు, ఆర్ టి సి ఉద్యోగ నాయకులు శాస్త్రి గారు, తెలుగు పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు గోపాలుని రమేష్, కమలపురి శ్రీనివాసులు, వెంకటేశ్వర స్వామి మందిరం అధ్యక్షులతదితరులు వీరి నియామకాని ప్రశనీసించినారు

# ఉదయాన్నే 20 మిలీ ఈ జ్యూస్ తాగండి - షుగరు సహా ఇవన్నీ కంట్రోల్..!!



ఉసిరి రసం పలు ఆరోగ్య సమస్యల పరిష్కారినికి ఒక వరం. ఈ రసంలో రసంలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఉసిరి రసం ప్రతీ రోజు 50 ఎంఎల్ తీసుకోవటం ద్వారా ఎన్నో దీర్ఘ కాలిక సమస్యలు నియంత్రణలో ఉంటాయి. ఆజీర్తి, గుండె సంబంధిత సమస్యలు, షుగర్ లెవల్స్ తో పాటుగా కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జుట్టు నల్లగా మార్చటానికి సహకరిస్తుంది. దీంతో పాటుగా ఎన్నో ప్రయోజనాలు తులసి రసం ద్వారా అందుతాయి.ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుంది. పోషకాల శోషణ సామర్థ్యం మెరుగుపడుతుంది. దీంతో పోషకాల లోపం దరి చేరదు. ఉసిరి రసంలో విటమిన్ సి కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని బలంగా మార్చుతుంది. ఉసిరి రసం తాగితే సీజనల్ ఇన్ఫెక్షన్ల రిస్క్ తగ్గుతుంది. ఖాళీ కడుపుతో ఉసిరి రసం తాగడం వల్ల జీర్ణ స్రావాల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో జీర్ణ సమస్యలు రావు. మలబద్ధకం, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కణాలను ఆరోగ్యంగా మార్చుతాయి. ఉసిరి తింటే చర్మం ఎలాస్టిసిటీ పెరుగుతుంది. దీంతో ముడతలు తగ్గుతాయి. జుట్టును వేర్ల నుండి సహజంగా నల్లగా మార్చడానికి సహాయపడుతుంది.

# సూపర్ టేస్టీ 'రవ్వ కేసరి'.. ఇదొక్కటి యాడ్ చేస్తే చాలు అద్భుతం అంతే..!



స్వీట్స్ లో రవ్వ కేసరి అనగానే చాలామందికి నోరూరుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకు రవ్వకేసరిని ఇష్టంగా తింటారు. పెళ్లిళ్లు, శుభకార్యాలు ఇలా ఏ ఫంక్షన్? అయినా ఈ స్వీట్ కచ్చితంగా ఉండాల్సిందే. తయారీ వేగంగా ఉండటంతోపాటు టేస్ట్? కూడా సూపర్ ?గా ఉండటంతో చాలా మంది ఈ స్వీట్ ?ను చేయడానికి ఇష్టపడుతున్నారు. మరి రవ్వ కేసరి తయారీ విధానం ఏంటి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఇంట్లోనే ఈజీగా ఎలా తయారు చేసుకోవాలి..?రవ్వ కేసరి తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే ముందుగా బొంబాయి రవ్వ ఒక కప్పు, చక్కెర 1.5 కప్పులు, పాలు ఒక కప్పు, నీళ్లు రెండు కప్పులు, యాలకుల పొడి ఒక టేబుల్ స్పూన్, నెయ్యి అర కప్పు, పావు కప్పు, కిస్మిస్ పావు కప్పు, పసుపు, రవ్వ కేసరి రంగు చిటికెడు తీసుకోవాలి.రవ్వ కేసరి తయారు చేసే విధానం చూస్తే ముందుగా పాన్ లో నెయ్యి వేడి చేయాలి. అందులో బొంబాయి రవ్వను దోరగా వేయించుకోవాలి. మరొక పాత్రలో నీళ్లు, పాలు పోసి మరిగించాలి. ఇప్పుడు వేయించిన రవ్వను వేస్తూ కలుపుకోవాలి. అలా ఉండలు కట్టకుండా చూసుకోవాలి. ఇప్పుడు రవ్వ ఉడికిన తర్వాత చక్కెర, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రంగు వేసి బాగా కలుపుకోవాలి. ఇక మిగిలిన నెయ్యిలో జీడిపప్పు, కిస్మిస్ వేసి వేయించుకోవాలి. అలా కేసరిలో కలిపి దించుకోవాలి. ఇప్పుడు తయారైన రవ్వ కేసరిని వేడివేడిగా సర్వింగ్ చేసుకుంటే సరి.. సూపర్ టేస్టీ రవ్వ కేసరి రెడీ అయినట్టే..

# రివర్స్ వాకింగ్, రివర్స్ జాగింగ్- ఇప్పుడిదే ట్రెండింగ్: మనమూ ట్రై చేస్తే పోలా

వెనక్కి నడవడం, వెనక్కి పరుగెత్తడం.. అంటే రివర్స్ వాకింగ్, రివర్స్ జాగింగ్. దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? దీని వెనక అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం మాత్రమే కాకుండా, అనేక శారీరక, మానసిక ఉపశమనాలను అందిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. వెనక్కి నడవడం లేదా పరిగెత్తడం ఓ అద్భుతమైన కార్డియో వ్యాయామం. ఈ వ్యాయామ పద్ధతి బరువు తగ్గడం, శరీర కూర్పు మెరుగుదలను చూపించిందని అధ్యయన ఫలితాలు స్పష్టం చేశాయి. హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది సమర్థవంతంగా పని చేస్తుంది.ప్రముఖ పోషకాహార నిపుణురాలు జుహీ కపూర్ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వెనక్కి నడవడం వల్ల కాళ్ళు బలంగా తయారవుతాయని తెలిపారు. ఈ ప్రక్రియ.. ఇంతకు ముందు మనం నిత్య జీవితంలో ఎప్పుడూ ఉపయోగించని కండరాలకు సైతం పూర్తిస్థాయిలో పని కల్పిస్తుందని, తద్వారా వాటిని బలోపేతం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు.మోకాలి నొప్పితో బాధపడేవారు లేదా మోకాలికి గాయాలు తగిలిన వారికి వెనక్కి నడవడం వారి రిహాబిలిటేషన్ కు ఎంతగానో తోడ్పడుతుందని జుహీ కపూర్ సూచించారు. రివర్స్ జాగింగ్ లేదా రివర్స్ వాకింగ్ వల్ల మోకాలిపై ప్రభావం తక్కువగా ఉంటుంది. జర్నల్ ఆఫ్ బయోమెకానిక్స్‌లో ప్రచురితమైన మరో అధ్యయనం వెనక్కి పరిగెత్తడం వల్ల ముందు మోకాలి నొప్పి తగ్గుతుందని ఆమె తెలిపారు.ఈ పద్ధతి ద్వారా కార్డియోప్రొటెక్షన్, అధిక కేలరీల బర్నింగ్, మోకాళ్ళను బలోపేతం చేయడం, కాళ్ళ కండరాలను దృఢపరచడం, నడుము నొప్పి తగ్గించడం, సయాటికా నుండి ఉపశమనం వంటి వాటికి సహాయపడుతుందని పేర్కొన్నారు. మైండ్ అండ బాడీ కనెక్షన్‌ను మెరుగుపరచడంలో వెనక్కి నడవడం ఎలా దోహదపడుతుందో 'ది బాడీ సైన్స్ అకాడమీ' సహ వ్యవస్థాపకుడు వరుణ్ రతన్ వివరించారు.ముందుకు నడవడం సులభమని, కానీ వెనక్కి నడవడానికి పూర్తి ఏకాగ్రత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాయామం ముందుకు వెళ్లేటప్పుడు వేగాన్ని నియంత్రించే కండరాలకు శిక్షణనిస్తుంది. ముందుకు నడవడం కంటే వెనక్కి నడవడం దిగువ అవయవాల కండరాలను సమర్థవంతంగా ఉత్తేజపరుస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయని రతన్ తెలిపారు.

మోకాలి ఎక్స్‌టెన్సర్ కండరాలను బలోపేతం చేయడమే కాకుండా, వెనక్కి నడవడం వల్ల శరీర సమతుల్యత గణనీయంగా మెరుగుపడుతుంది. ఈ వ్యాయామం శ్వాసకోశ, హృదయ స్పందన వ్యవస్థలను మరింత మెరుగుపర్చుతుంది. ఇలా చేయడం వల్ల ముందుకు నడిచే వేగాన్ని పెంచడానికి కూడా తోడ్పడుతుంది.ట్రెడ్‌మిల్‌పైనా రివర్స్ జాగింగ్, రివర్స్ వాకింగ్ చేయవచ్చు. ఇలా చేసేటప్పుడు మన ఆలోచన మొత్తం కూడా శరీరంపైనే ఉంటుంది. దీనివల్ల ఏకాగ్రత సైతం పెరుగుతుంది. మైండ్-బాడీ మధ్య సమన్వయం గణనీయంగా మెరుగుపడుతుంది.

# రోజూ గుప్పెడు గింజలు తినండి - ఈ సమస్యలన్నీ పరార్..!!

రోజూ వారీ జీవితంలో మార్పులు వస్తున్నాయి. ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. కొత్త ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ సమయంలో నట్స్ అందరికీ మేలు చేసే ఆహారంగా మారింది. అందులో గుమ్మడి గింజలు ప్రధానమైనవి. వీటిలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. వీటి ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. గుమ్మడి గింజల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. గుమ్మడి గింజలు మొక్క ఆధారిత ప్రోటీన్ ను మనకు అందిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల వెన్నెముక బలంగా తయారవ్వడంతో పాటు కండరాల మరమ్మత్తు కూడా సక్రమంగా జరుగుతుంది. అయితే వీటిని అధికంగా తీసుకుంటే మాత్రం కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వీటిని ఎక్కువగా ఎవరు తినకూడదు వంటి విషయాలపై నిపుణలు స్పష్టత ఇస్తున్నారు.గుమ్మడికాయ గింజలు అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన పోషకాలను ఇచ్చే మంచి ఆహారం. ఇక గుమ్మడి గింజలను నేరుగా స్నాక్స్‌గా తినవచ్చు. సలాడ్లలో కూడా వీటిని కలుపుకొని తీసుకోవచ్చు. ఇక సూప్ లలో కూడా గుమ్మడి గింజలు వేసుకొని తినవచ్చు. స్మూతీస్ లో కూడా గుమ్మడి గింజలను తీసుకోవచ్చు. గుమ్మడి గింజలను రోజు ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల గుమ్మడి గింజల్లో ఉండే పోషకాలు మన శరీర ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. గుమ్మడి గింజలలో సంవృద్ధిగా ఉండే పోషకాలు ఇవే గుమ్మడి గింజలలో మోనో అన్ శాచ్యురేటెడ్, పాలి





అన్ శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ కే, విటమిన్ ఈ, విటమిన్ బి కాంప్లెక్స్ గుమ్మడి గింజలలో లభిస్తాయి. మెగ్నీషియం, జింక్, ఫాస్ఫరస్, కాపర్ వంటి ఖనిజాలు గుమ్మడి గింజల్లో సమృద్ధిగా ఉంటాయి. గుమ్మడి గింజలు శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించే యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి.

**నిపుణుల సూచనలు**

ఇక ఇన్ని పోషకాలు ఉన్న గుమ్మడి గింజలను మనం ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. గుమ్మడి గింజల్లో ఉండే జింక్, మెగ్నీషియం మెదడు ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. గుమ్మడి గింజల్లోని ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం మెలటోనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఇది మంచి నిద్రకు ఉపకరిస్తుంది. గుమ్మడి గింజలు ఎక్కువ సేపు మన ఆకలిని తీర్చడానికి దోహదం చేస్తాయి. మన బరువును నియంత్రించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. గుమ్మడి గింజలు ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలను కలిగి ఉంటాయి. ఈ కొవ్వులు కీళ్లను దృఢంగా చేయడంతో పాటు వాపు, నొప్పి వంటి సమస్యలను కూడా తగ్గిస్తాయి. కనుక నడుము నొప్పితో బాధపడే వారు ఈ గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అయితే గుమ్మడి గింజలను అలర్జీలు ఉన్నవారు, బీపీ ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, జీర్ణ సమస్యలు ఉన్నవారు, కొన్ని రకాల మందులు వాడేవారు తీసుకోకూడదు.

# నేరేడు గింజల పౌడర్ తీసుకుంటే చాలు

వేసవిలో లభించే నేరేడు పండ్లు పోషకాల గని. ముఖ్యంగా డయాబెటిస్ నియంత్రణకు ఇవి అద్భుతమైనవిగా పరిగణిస్తారు. ఈ పండ్లు చాలా తక్కువ కాలం మాత్రమే లభిస్తాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలను ఏడాది పొడవునా ఎలా పొందవచ్చో తెలుసుకోవడానికి, నేరేడు గింజలను నిల్వ చేసే పద్ధతి, వాటిని ఉపయోగించే విధానం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.నేరేడు తీయగా, కాస్త వగరుగా ఉంటుంది. దీనిలో ఉండే జంబోలిన్, జంబోసిన్ వంటి పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. ఇది డయాబెటిస్ రోగులకు మాత్రమే కాకుండా, జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కూడా ప్రయోజనకరం. నేరేడు పండు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, మలబద్ధకం, ఎసిడిటీ, అజీర్తి వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది.ఆయుర్వేదంలో నేరేడు పండ్లు, వాటి ఆకులతో పాటు గింజలకు కూడా విశేష ప్రాధాన్యత ఉంది. ఈ పండు కొద్ది కాలం మాత్రమే దొరుకుతుంది కాబట్టి, దాని నుంచి ఏడాది పొడవునా ప్రయోజనం పొందే పద్ధతులు ఉన్నాయి. నేరేడు గింజలను ఎలా నిల్వ చేయాలి, ఎలా వాడాలో డైటీషియన్ లీలా మహాజన్ చేసిన సూచనలను ఇప్పుడు పరిశీలిద్దాం.నేరేడు గింజలను డయాబెటిస్ కోసం ప్రపంచంలోనే అత్యుత్తమ సహజ ఔషధాలలో ఒకటిగా పరిగణిస్తారు. వీటిలో జంబోలిన్, జంబోసిన్ వంటి గ్లూకోసైడ్‌లు, ఆల్కలాయిడ్‌లు ఉంటాయి. ఇవి శరీరంలో స్టార్చ్‌ను చక్కెరగా మార్చే ప్రక్రియను నెమ్మది చేస్తాయి. తద్వారా రక్తంలో చక్కెర స్థాయి అకస్మాత్తుగా పెరగకుండా ఇవి నియంత్రిస్తాయి.ఈ గింజలలో పాలీఫెనాల్స్, క్వెర్సెటిన్,





ఎలాజిక్ ఆసిడ్, టానిన్‌లు, ఫ్లేవనాయిడ్‌లు వంటి ముఖ్యమైన సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ సమ్మేళనాలు ఆహారం తర్వాత గ్లూకోజ్ రియాక్షన్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి, శరీరంలో కలిగే మంటను ఉపశమనం చేసి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతాయి.నేరేడు పండు ఎంత పోషకాలు కలిగి ఉంటుందో, దాని గింజలు కూడా అంతే ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఆయుర్వేదంతో పాటు ఆధునిక విజ్ఞానం కూడా నేరేడు గింజలను మినరల్స్, పోషకాలకు అద్భుతమైన వనరు. ఈ గింజలలో ఐరన్, మెగ్నీషియం, జింక్, పొటాషియం వంటి కీలక ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి.నేరేడు గింజలు ఇన్సులిన్ రెసిస్టెన్స్, మెటబాలిక్ సిండ్రోమ్, ఫ్యాటీ లివర్, శరీర వాపు, అధిక కొలెస్ట్రాల్, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో గణనీయంగా సహాయపడతాయి. ఈ గింజల క్రమం తప్పకుండా వాడకం మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**నేరేడు గింజల పొడిని ఎలా తయారు చేయాలి?**

నేరేడు గింజల పొడిని తయారు చేయడానికి ముందుగా గింజలను శుభ్రంగా కడగాలి. అనంతరం, వాటిని 4-5 రోజుల పాటు సూర్యరశ్మిలో లేదా ఇంట్లోనే పూర్తిగా ఆరబెట్టాలి. గింజలలో తేమ ఏ మాత్రం లేకుండా చూసుకోవడం ముఖ్యం. పూర్తిగా ఎండిన తర్వాత, వాటిని మెత్తని పొడిలా చేసి, గాలి చొరబడని డబ్బాలో భద్రపరచుకోవాలి.

**పొడిని ఎలా ఉపయోగించాలి?**

నిపుణుల సలహా ప్రకారం, ఈ పొడిని రోజుకు అర టీస్పూన్ నుండి ఒక టీస్పూన్ వరకు నీటితో లేదా మజ్జిగతో కలిపి తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా ఈ పొడిని వాడటం ఆరోగ్యానికి మంచిది.

# బోలెడు హెల్త్ బెనిఫిట్స్ ఇచ్చే "కీన్ వా" ఎలా చేయాలంటే ???

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలనుకునేవారికి క్వినోవా ఇప్పుడు బెస్ట్ ఛాయిస్‌గా మారింది. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు పుష్కలంగా ఉండే ఈ సూపర్ ఫుడ్‌ను చాలా ఈజీగా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. అన్నానికి బదులుగా కూడా దీనిని వాడుకోవచ్చు. మరి టేస్టీగా, పొడిపొడిగా క్వినోవా ఎలా తయారు చేయాలో చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు..**

క్వినోవా - 1 కప్పునీరు - 2 కప్పులుఉప్పు - తగినంతవెన్న లేదా ఆలివ్ ఆయిల్ - 1 టీ స్పూన్మిరియాల పొడి - చిటికెడు (ఐచ్ఛికం)నిమ్మరసం - కొద్దిగా (ఐచ్ఛికం)క్వినోవా గింజలపై సహజంగా ఉండే చేదు పొర తొలగించేందుకు ముందుగా దాన్ని బాగా కడగాలి.ఒక జల్లెడలో క్వినోవా వేసుకోవాలిచల్లటి నీటితో 2-3 సార్లు కడగాలినీరు పూర్తిగా వడకట్టాలి ఇలా చేస్తే క్వినోవాకు చేదు రుచి రాదు.**తయారీ విధానం..**

ఒక పాన్ లేదా గిన్నెలో కొద్దిగా వెన్న లేదా ఆలివ్ ఆయిల్ వేసి వేడి చేయాలి.శుభ్రం చేసిన క్వినోవాను వేసి 2 నిమిషాలు తేలికగా వేయించాలి. ఇలా చేస్తే మంచి సువాసన వస్తుంది.ఇప్పుడు 2 కప్పుల నీరు, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి.మీడియం మంటపై నీరు మరిగే వరకు ఉంచాలి.నీరు మరిగిన తర్వాత మంట తగ్గించి మూత పెట్టాలి.15-20 నిమిషాల పాటు సిమ్‌లో ఉడికించాలి.నీరు పూర్తిగా ఆవిరైపోయిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి 5 నిమిషాలు అలాగే ఉంచాలి.చివరగా ఫోర్క్‌తో మెల్లగా విడదీయాలి. దీంతో క్వినోవా పొడిపొడిగా, ఫ్లఫీగా తయారవుతుంది.మరింత రుచికోసం టిప్స్..నీటికి బదులుగా వెజిటేబుల్ బ్రోత్ వాడితే టేస్ట్ పెరుగుతుందిఉడికిన తర్వాత నిమ్మరసం కలిపితే ఫ్రెష్ ఫ్లేవర్ వస్తుందిక్యారెట్, బీన్స్, క్యాప్సికమ్ వంటి కూరగాయలు వేసి వెజ్ క్వినోవా చేసుకోవచ్చుమిరియాల పొడి లేదా హెర్బ్స్ కలిపితే మరింత రుచిగా ఉంటుందిక్వినోవాతో చేసుకునే వంటలు..క్వినోవా పులావ్క్వినోవా సలాడ్క్వినోవా ఉప్మాబ్రేక్‌ఫాస్ట్ బౌల్హెల్తీ ఫ్రైడ్ క్వినోవాక్వినోవా తినడం వల్ల ప్రయోజనాలు..ప్రోటీన్ ఎక్కువగా లభిస్తుందిబరువు తగ్గేందుకు సహాయపడుతుందిజీర్ణక్రియ మెరుగుపడుతుందిడయాబెటిస్ ఉన్నవారికి మంచిదిగుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది



# స్పోర్ట్స్ న్యూస్

## రాజస్థాన్‌తో మ్యాచ్.. ఎస్ఆర్‌హెచ్‌లో వారిద్దరిపై వేటు!




ఐపీఎల్ 2026 ఎలిమినేటర్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో అమీతుమీ తేల్చుకునేందుకు సన్ రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. ఇవాళ చండీగఢ్ వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫయర్ 2కు అర్హత సాధించాలని ఎస్ఆర్‌హెచ్ పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తుది జట్టు ఎలా ఉంటుందా అనే ఆసక్తి ఆరెంజ్ ఆర్మీ అభిమానుల్లో ఉంది. ఈ 'డూ ఆర్ డై' మ్యాచ్‌లోఎస్ఆర్‌హెచ్ రెండు కీలక మార్పులతో బరిలోకి దిగనుందని సమాచారం.మిడిలార్డర్ బ్యాటరైన స్మరణ్ రవిచంద్రన్‌ను పక్కన పెట్టాలని ఆరెంజ్ ఆర్మీ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత కొన్ని మ్యాచ్‌ల్లో స్మరణ్‌కు అవకాశం లభించినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఈ క్రమంలోనే ఇవాళ జరిగే కీలక పోరుకు అతడిని తప్పించనున్నట్లు సమాచారం. అతడి స్థానంలో ఫినిషర్ అనికేత్ వర్మను తుది జట్టులోకి తీసుకోవాలని సన్ రైజర్స్ భావిస్తుందంట.అనికేత్ కూడా అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయాడు. గత సీజన్‌లో దుమ్ములేపిన అనికేత్.. ఈ సీజన్‌లో మాత్రం విఫలమయ్యాడు. 8 ఇన్నింగ్స్‌లో కేవలం 79 పరుగులు చేశాడు. కానీ గత సీజన్‌లో అతడి ప్రదర్శన చూసిన ఆరెంజ్ ఆర్మీ మేనేజ్‌మెంట్.. అతడిపై నమ్మకం ఉంచిన మరో అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక ఎస్ఆర్‌హెచ్ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆడిన హర్షల్ పటేల్‌ను కూడా తిరిగి బెంచ్‌కే పరిమితం చేయనున్నట్లు క్రీడా వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అతడి స్థానంలో యువ పేసర్ ప్రఫుల్ హింగేకు అవకాశమివ్వన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా స్మరణ్, హర్షల్ పటేల్ పై వేటు పడే అవకాశం ఉందని సమాచారం. ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే.. మరికొన్ని గంటలు ఆగాల్సిందే.నివేదికల ప్రకారం.. రాజస్థాన్ రాయల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ కోసం మహారాజా యాదవేంద్ర సింగ్ పీసీఏ స్టేడియంలోని పిచ్ 4ను ఉపయోగించనున్నారు. ఇదే పిచ్‌పై పంజాబ్ కింగ్స్ తమ చివరి హోమ్ మ్యాచ్ ఆడి 200 పరుగులకు పైగా ఉన్న టార్గెట్‌ను సునాయాసంగా ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్ వంటి విధ్వంసక ప్లేయర్లు ఉండటంతో ఎస్ఆర్‌హెచ్, ఆర్ఆర్ జట్లు టాస్ గెలిస్తే తొలుత బ్యాటింగ్ చేయడానికి ఇష్టపడతాయని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), శివంగ్ కుమార్, ఈషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్.

## వైభవ్ కోసం మూడు ప్రణాళికలు సిద్ధం చేశాం: కమిన్స్




ఐపీఎల్ 2026 ఎలిమినేటర్ పోరుకు రంగం సిద్ధమైంది. నేడు ముల్లాన్‌పూర్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. కాగా గెలిచిన జట్టు క్వాలిఫయర్ 2కి అర్హత సాధించి అక్కడ గుజరాత్ టైటాన్స్‌తో అమీతుమీ తేల్చుకుంటుంది. ఇప్పటికే ఈ సీజన్‌లో రాజస్థాన్‌పై రెండు విజయాలు సాధించిన ఎస్ఆర్‌హెచ్.. ఈ కీలక పోరులో నెగ్గి వరుసగా మూడో విజయాన్ని అందుకోవాలని చూస్తోంది. అది జరగాలంటే.. ఆర్ఆర్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దూకుడును హైదరాబాద్ బౌలర్లు అడ్డుకోగలగాలి.ఈ సీజన్‌లో వైభవ్‌పై సన్‌రైజర్స్‌కు మిశ్రమ అనుభవం ఎదురైంది. తొలి మ్యాచ్‌లో అతడిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన హైదరాబాద్ బౌలర్లు.. రెండో మ్యాచ్‌లో మాత్రం అతడి విధ్వంసాన్ని అడ్డుకోలేకపోయారు. ఆ మ్యాచ్‌లో వైభవ్ సెంచరీతో చెలరేగిపోయాడు. అయినప్పటికీ రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం మాత్రం సన్‌రైజర్స్‌కే దక్కింది. ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాట్లాడాడు. వైభవ్‌ను అడ్డుకోవడం కోసం ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేసినట్లు వెల్లడించాడు.'బౌలర్‌గా మా బలాలేంటి అనేది తెలుసుకోవడం ముఖ్యం. కానీ ప్రత్యర్థి జట్టులో మ్యాచ్‌ను ఒక్కడే మలుపు తిప్పగల ప్లేయర్ ఉంటే అతడికి ప్రత్యేక ప్రణాళిక అవసరం. అందుకే వైభవ్ కోసం మూడు ప్రణాళికలు సిద్ధం చేశాం. గత మ్యాచ్‌లో అతడు మా మీద సెంచరీ చేసినా.. కొన్ని దశల్లో మేము అతడిని బాగా కట్టడి చేశాం. కొన్ని సందర్భాల్లో మాత్రం వైభవ్‌ను అడ్డుకోలేకపోయాం. ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ప్రతి మ్యాచ్ కొత్తగా మొదలవుతుంది. అయితే గత మ్యాచ్‌ల నుంచి నేర్చుకున్న విషయాలు మాత్రం ఉపయోగపడతాయి. ఆర్ఆర్ ఆటగాళ్లపై మాకు స్పష్టమైన అవగాహన ఉంది. మా ప్లేయర్లు కూడా గత విజయాల అనుభవాన్ని ఉపయోగించుకుంటారు' అని కమిన్స్ తెలిపాడు.

## 'ఇదొక తెలివి తక్కువ ప్రశ్న'.. రిపోర్టర్‌పై గ్లెన్ ఫిలిప్స్ ఆగ్రహం




ఐపిఎల్ 19వ సీజన్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆర్‌సిబి చేతిలో గుజరాత్ టైటాన్స్ జట్టు చిత్తుగా ఓడిపోయింది. దీంతో ఆర్‌సిబి మరోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆర్‌సిబి ముందుంచిన 254 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ ఛేదించలేకపోయింది. 19.3 ఓవర్లలో 162 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. అయితే మ్యాచ్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశానికి గుజరాత్ ఆటగాడు గ్లెన్ ఫిలిప్స్ హాజరయ్యాడు. తుది జట్టులో లేని ఫిలిప్స్ మీడియా సమావేశానికి హాజరు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే ఈ సందర్భంగా ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్న.. ఫిలిప్స్‌ని ఆగ్రహానికి గురి చేసింది. మహిళకు ఎబోలా నెగెటివ్.. అంతా ఊపిరి పీల్చుకున్నారు.. 'బెంగళూరు 254 పరుగుల భారీ స్కోరు చేయడం చూసి గుజరాత్ ఓటమిని అంగీకరించిందా?' అని ఓ రిపోర్టర్ అడిగాడు. దాంతో ఫిలిప్స్ నివ్వెరపోయాడు. 'నిజంగానే ఇది ఒక తెలివి తక్కువ ప్రశ్న. మనం ఈ ప్రయత్నాన్ని వదిలేద్దాం అని అనుకుంటూ ఎవరూ మైదానంలో అడుగుపెట్టరు. ప్రొఫెషనల్ క్రికెటర్లుగా మేం అలా ఎందుకు చేస్తాం? అదొక అత్యంత చెత్త ప్రశ్న. మేం మైదానంలోకి దిగి మా శాయశక్తుల పోరాడాము. 250+ పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేస్తున్నప్పుడు ప్రతిదీ మనకు అనుకూలంగా జరగాలి. గెలవాలనే సంకల్పంతోనే మేము బరిలోకి దిగాం. కానీ, అది జరగలేదు" అని ఫిలిప్స్ పేర్కొన్నాడు.

## ఆర్సీబీ విజయ రహస్యం అదే..! : భువనేశ్వర్



హైదరాబాద్ : ఐపీఎల్ 2026 సీజన్‌లో స్వింగ్ కింగ్, టీమిండియా పేసర్ భువనేశ్వర్ కుమార్ అదరగొడుతున్నాడు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ పర్పుల్ క్యాపు రేసులో దూసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో క్వాలిఫయర్1లో గుజరాత్ టైటాన్స్ పై ఆర్సీబీ జట్టు విజయం సాధించిన అనంతరం తమ జట్టు విజయ రహస్యలను, బౌలింగ్ ప్రణాళికల గురించి తన అనుభవాలను పంచుకున్నాడు. జట్టు విజయాలలో గణాంకాల పాత్ర ఉందన్నారు.అయితే దానిపైనే 100 శాతం ఆధారపడబోమని స్పష్టం చేశారు. కొత్తగా ఆడే ఆటగాళ్లు ఏదైనా కొత్త ప్రయోగాలు చేసినప్పుడు, వారి డేటాను నిశితంగా పరిశీలిస్తామని భువీ పేర్కొన్నారు. ప్రత్యర్థి బ్యాటర్లను భారీ షాట్లు ఆడకుండా కట్టడం చేయడం, ఎల్‌బీడబ్ల్యూ లేదా బౌల్డ్ చేయడంపై దృష్టి పెడుతామని పేర్కొన్నారు. మా అనుభవం (భువీ, జోష్ హేజిల్‌వుడ్) కూడా జట్టుకు ఉపయోగపడుతుందన్నారు. సహాయక సిబ్బంది వారు అందిస్తున్న చిన్న చిన్న మెళకువలు మాకు బాగా కలిసివస్తున్నాయి.ఆర్సీబీ వరుసగా రెండోసారి ఫైనల్స్‌కు చేరుకోవడంతో తెరవెనుక పనిచేసిన సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాగా, భువనేశ్వర్ ఈ సీజన్‌లో 15 మ్యాచ్‌లలో 18.15 సగటుతో, 8.00 ఎకానమీ రేటుతో 26 వికెట్లు పడగొట్టాడు. అతని అత్యుత్తమ గణాంకాలు 4/23. ఆర్సీబీ ఐపీఎల్ ఫైనల్స్‌కు చేరడం ఇది5వ సారి. ముంబై ఇండియన్స్ (6 సార్లు ఫైనల్స్‌కు చేరి, 5సార్లు టైటిల్ గెలుచుకుంది). చెన్నై సూపర్ కింగ్స్ (10 సార్లు ఫైనల్స్‌కు చేరి,5సార్లు టైటిల్ గెలుచుకుంది).

## చెన్నై సూపర్ కింగ్స్ కోచ్‌గా ఎంఎస్ ధోనీ!




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని కీలకమైన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. ఈ జట్టు ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. ఇక్కడ సీఎస్కే జట్టు అనగానే గుర్తుకు వచ్చే పేరు ఎంఎస్ ధోని. సీఎస్కే అంటే ధోని.. ధోని అంటే సీఎస్కే అనే అంతలా మారింది.. ఆ జట్టు పరిస్థితి. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు సార్లు టైటిల్ అందించడంలో ఈ మిస్టర్ కూల్ ప్రధాన పోషించాడు. తాజాగా ధోనీ భవిష్యత్తుపై ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ సంచలన ప్రకటన చేశారుమోకాలి గాయం కారణంగా ధోనీ ఐపీఎల్ 2026 సీజన్లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో ధోనీ ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో సీఎస్కే జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ధోనీ జట్టులో ఏ పాత్రలో ఉండాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది పూర్తిగా అతడి వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ధోనీ సీఎస్కే జట్టులోనే శాశ్వతంగా కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించారు.'ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. ధోని ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది' అని సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ధోనీ అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించనప్పటికీ.. వచ్చే సీజన్ నాటికి ఎంఎస్ ధోనీ సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే ఊహాగానాలకు సీఎస్కే సీఈవో వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి.

## శ్రేయస్ అయ్యర్ ఎక్కడ.. కేకేఆర్ ఎక్స్ పోస్ట్‌పై అభిమానుల ఆగ్రహం!

కోల్‌కతా నైట్ రైడర్స్.. రెండేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజు తమ మూడో ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. దాదాపు పదేళ్ల తర్వాత 2024లో అప్పటి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. కేకేఆర్‌కు కప్పును అందించాడు. తాజాగా కేకేఆర్ తమ ఎక్స్ ఖాతాలో దానికి సంబంధించిన ఫొటోలను పోస్ట్ చేసింది. అయితే ఇక్కడే ఓ వివాదం తెరపైకి వచ్చింది. కేకేఆర్ చేసిన ఆ పోస్ట్ అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. అసలు ఏమైందంటే..2024 ఐపీఎల్ సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో కోల్‌కతా నైట్ రైడర్స్..సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి ట్రోఫీని ముద్దాడింది. దాదాపు పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మూడోసారి ఐపీఎల్ కప్పు నెగ్గింది. ఆ విజయానికి రెండేళ్లు అవ్వడంతో కేకేఆర్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఫైనల్ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించిన ప్లేయర్ల ఫొటోలను కూడా షేర్ చేసింది. అయితే ఆ టైటిల్ విజయంలో జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాత్రం ఏ ఫొటోలోనూ కనిపించలేదు. దీంతో అభిమానులు సోషల్ మీడియాలో కేకేఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. జట్టుకు మూడో ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్‌కు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ట్రోఫీ గెలిపించిన కెప్టెన్ ఎక్కడ?', 'శ్రేయస్‌ను ఎందుకు పక్కన పెడుతున్నారు?' అంటూ ప్రశ్నిస్తున్నారు.2025 మెగా వేలానికి ముందు శ్రేయస్ అయ్యర్‌ను కేకేఆర్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అభిమానుల్లో అసంతృప్తి కనిపిస్తోంది. టైటిల్ గెలిపించిన నాయకుడిని వదులుకోవడం సరైన నిర్ణయం కాదంటూ అప్పట్లోనూ విమర్శలు వచ్చాయి. అనంతరం అయ్యర్ పంజాబ్ కింగ్స్‌లో చేరాడు. ఇక ఐపీఎల్ 2026లో అజింక్య రహానె నాయకత్వంలో బరిలోకి దిగిన కేకేఆర్.. ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం ఆరు విజయాలతో లీగ్ స్టేజ్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోవైపు శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ కింగ్స్ కూడా ఆశాజనక ఆరంభం చేసినప్పటికీ.. వరుస పరాజయాలతో ప్లే ఆఫ్స్ అవకాశాలు కోల్పోయింది.





# సినిమా



## ముదిరిన డాన్-3 వివాదం

### రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం




'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు.

2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ.10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ.45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్లు నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.

## బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు



'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక్ అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది. 'పెద్ది' తన గుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు. ఆ అంశం నాకు చాలా నచ్చిందని చెప్పారు.

## చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల




నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి



## విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత

### మెగా ఫ్యాన్స్‌లో గందరగోళం



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక్ వినిపిస్తోంది. ఫాంటసీ జానర్ కావడంతో సినిమాకు భారీ స్థాయిలో అవసరం పడుతోంది. ముఖ్యంగా ఫాంటసీ జానర్‌లో వస్తున్న 'విశ్వంభర' పై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతుండటం, 'విశ్వంభర'పై మాత్రం నిశ్శబ్దం






Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**